నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

ఏటీఎంలో చోరీకి యత్నం

పట్టుబడిన దొంగలు

రాంనగర్, సెప్టెంబర్ 22 : నగరంలోని భగత్‌నగర్ ప్రాంతంలోని ఓ ఏటీఎంలో మెషిన్ పనిచేయకుండా చేసి డబ్బులు ఎత్తుకెళ్లేందుకు యత్నించిన దొంగలను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. భగత్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు ఏటీఎంకి వెళ్లి రూ.పది వేల నగదు డ్రా కోసం వివరాలు ఎంటర్ చేశాడు. అయితే, విత్‌డ్రా అయినట్టు మెసేజ్ వచ్చినా ఏటీఎం మెషిన్ నుంచి నగదు రాలేదు. కొద్దిసేపు వేచి చూసి తిరిగి అకౌంట్లోకి డబ్బులు వస్తాయని భావించి బయటకు వెళ్లాడు. అదే సమయంలో ఏటీఎం ముందు స్నేహితుడు కలవడంతో అతనితో మాట్లాడుతుండగా ఏటీఎంలోకి వెళ్లిన ముగ్గురు యువకులు మిషన్ నుంచి నగదు తీసుకుని వచ్చారు. దీంతో అనుమానం వచ్చిన యువకుడు వారిని నిలదీసేసరికి పారిపోయే ప్రయత్నం చేశారు. ఏటీఎం కార్డు పెట్టకుండానే డబ్బులు ఎలా? వచ్చాయని నిలదీయడంతో వారు వేరే భాషలో మాట్లాడారు. దీంతో స్థానికుల సహకారంతో బంధించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడినవారు స్థానికులు కాదని, వారి దగ్గర ఎలాంటి గుర్తింపు కార్డులూ లభ్యం కాకపోవడంతో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

పేపర్లు దిద్దిన డబ్బులేవి..?

- ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల విధులు, మూల్యాంకనం చేసిన సార్లకు అందని రుసుం ? • మూడు నెలలుగా పెండింగ్
- మండిపడుతున్న జూనియర్ లెక్చరర్లు



ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ రుసుముకు సర్కారు ఎగనామం పెడుతున్నది. 'పరీక్షల విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించి పనులు చేయించుకుని, తీరా.. పేపర్లు దిద్దిన జూనియర్ లెక్చరర్లకు మొండిచేయి చూపుతున్నది. ఇప్పటికే గతేడాది పదో తరగతి మూల్యాంకనానికి సంబంధించి డబ్బులు ఇవ్వకపోగా, ఈ యేడు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల విధులు, మూల్యాంకనం డబ్బులు పెండింగ్‌లో పెట్టింది. మూడు నెలలైనా ఇప్పటికీ రూపాయి కూడా రాకపోవడంతో సార్లు మండిపడుతున్నారు. ఒక్కో అధ్యాపకుడికి రూ.15వేల నుంచి రూ.25వేలు రావాల్సి ఉందని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

జగిత్యాల, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పత్రాలు దిద్దిన సార్లకు సర్కారు డబ్బులు ఇవ్వడం లేదు. పరీక్షల విధులు సక్రమంగా నిర్వర్తించి, అవకతవకలు లేకుండా చూడాలని చెబుతూనే, ఎర్రని ఎండలో ఒత్తిడి మధ్య మూల్యాంకనం చేసిన వారికి న్యాయంగా ఇవ్వాల్సిన రెమ్యునరేషన్‌కు ఎగనామం పెడుతుండగా, లెక్చరర్లు మండిపడుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల రెమ్యునరేషన్ వివరాలు..

ఇంటర్మీడియెట్‌కు సంబంధించి ప్రాక్టికల్, థియరీగా రెండు పరీక్షలు ఉంటాయి. ఈ ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి విధులు నిర్వర్తించే ప్రతి ఒక్క బాధ్యుడికి ఇంటర్మీడియెట్ రెమ్యునరేషన్‌ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెమ్యునరేషన్ కోసం ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థుల వద్ద నుంచి పరీక్ష రుసుంను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్ (రోజుకు రూ.352), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ (రోజుకు రూ.313), స్కిల్డ్ అసిస్టెంట్ (రోజుకు రూ.188) స్టోర్ కీపర్, ల్యాబ్ అటెండర్, వాటర్‌మెన్లకు (రోజుకు రూ.128) చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రాక్టికల్ ఎగ్జామినర్‌కు సంబంధించి టీఏ, డీఏ (రోజుకు రూ.300) చెల్లించాల్సి ఉంటుంది. ప్రాక్టికల్ ఎగ్జామినర్ స్థానికంగా ఉన్న పరీక్ష కేంద్రాల్లో పనిచేస్తే, టీఏ,డీఏకు బదులుగా లోకల్ కన్వేయన్స్ కింద రోజుకు రూ.188 ఇవ్వాల్సి ఉంటుంది. ఇక ప్రాక్టికల్ ఎగ్జామినర్‌కు మూల్యాంకనానికి ఒక్క జవాబు పత్రానికి రూ.23.66 పైసలను చెల్లిస్తారు. ఇక థియరీ పరీక్షలకు సంబంధించి పెద్ద తతంగమే ఉంటుంది. థియరీ పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు రోజుకు రూ.352, డిపార్ట్‌మెంట్ అధికారికి రూ.313, ఇన్విజిలేటర్‌కు రోజుకు రూ.188, క్లర్క్‌కు రూ.156, అటెండర్, స్వీపర్లకు రోజుకు రూ.128 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీరు కాకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, డెస్క్ మెంబర్స్, హైపవర్ కమిటీ మెంబర్స్, డీఆర్‌డీసీ సభ్యులకు సైతం రోజువారీగా రెమ్యునరేషన్ చెల్లించాలి. మూల్యాంకనానికి సంబంధించి, క్యాంప్ ఆఫీసర్‌తో పాటు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లు, చీఫ్ ఎగ్జామినర్లకు రోజుకు రూ.800 రెమ్యునరేషన్ ఇవ్వాలి. మూల్యాంకనం చేసే ఎగ్జామినర్లకు సంబంధించి ఒక్కో జవాబు పత్రానికి రూ.23.66 పైసలు చెల్లించాలి. ఎగ్జామినర్ మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను స్క్రూటినైజర్ పరిశీలించాల్సి ఉంటుంది. ఇందుకు గాను ఒక్క జవాబు పత్రాన్ని పరిశీలించినందుకు రూ. 4.60 ఇవ్వాలి. ఒక్క స్క్రుటినైజర్ రోజుకు రూ.690 చెల్లించాల్సి ఉంటుంది. మూల్యాంకనం చేసే లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్‌కు సైతం ప్రతి రోజు డీఏ, టీఏ చెల్లించాల్సి ఉంటుంది. మూల్యాంకనం కేంద్రానికి యాభై కిలోమీటర్లకు పైబడిన కాలేజీ నుంచి విధులకు వచ్చే లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్‌కు ప్రతి రోజు అవుట్ స్టేషన్ అలవెన్స్ కింద రూ.703 చెల్లించాలి. ఇక యాభై కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్న కాలేజీ నుంచి విధులకు హాజరయ్యే వారికి డీఏ కింద రోజుకు రూ.300 చెల్లిస్తారు. ముల్యాంకన కేంద్రం ఉన్న పట్టణంలోను, లేదా 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న కాలేజీల నుంచి విధులకు హాజరయ్యే వారికి లోకల్ కన్వేయన్స్ కింద రూ.188 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు, మూల్యాంకనంలో పాల్గొనే ప్రతి ఉద్యోగికి ప్రత్యేక రెమ్యునరేషన్ ఇస్తుంటారు.

తలకిందులైన రెమ్యునరేషన్ల పంపిణీ

ఇంటర్, పదో తరగతి పరీక్షలు, జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి చెల్లించాల్సిన రెమ్యునరేషన్లు సరిగా అందడం లేదు. గతంలో ఇంటర్ పరీక్షలు ముగిసిన రోజే సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లు, డెస్క్ అధికారులు, లెక్చరర్లు, ఇతర బోధనేతర సిబ్బందికి డబ్బులు నేరుగా చేతికి అందించి దానికి సంబంధించి వర్క్‌డన్ పత్రంపై రెవెన్యూ స్టాంప్‌తో సంతకం తీసుకొని ఇంటర్ బోర్డుకు పంపించేవారు. పరీక్షలు నిర్వహించి, విధుల నుంచి రిలీవ్ అవుతుండగానే నేరుగా డబ్బులు లెక్చరర్ల చేతికి, టీచర్ల చేతికి అందేవి. అలాగే జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి సైతం అదే పద్ధతిని ఇంటర్, ఎస్సెస్సీ బోర్డులు అనుసరించేవి. మూల్యాంకనం ప్రారంభమైన తర్వాత మూడు నాలుగు రోజులకు లెక్చరర్లకు అడ్వాన్స్‌లు సైతం ఇచ్చేవారు. వాల్యుయేషన్ పూర్తయిన చివరి రోజు లెక్చరర్లు, టీచర్లు చేసిన పనిరోజులు, దిద్దిన పేపర్ల సంఖ్యను లెక్కించి రెమ్యునరేషన్‌ను లెక్క కట్టి ఇచ్చేవారు. ఈ క్రమంలో మూల్యాంకనమైనా, పరీక్షల విధులనైనా చేసేందుకు లెక్చరర్లు, టీచర్లు సంతోషించే వారు, ఉత్సాహంగా ముందుకు వచ్చేవారు. అయితే, గత విద్యా సంవత్సరం నుంచి పరిస్థితి మారిపోయింది. ఇంటర్, ఎస్సెస్సీ బోర్డులు పరీక్షలు, మూల్యాంకనానికి సంబంధించిన రెమ్యునరేషన్లను స్పాట్‌లో ఇవ్వడం లేదు. లెక్చరర్లు, టీచర్లు చేసిన విధులను లెక్కించి వారికి ఎంత రెమ్యునరేషన్ వస్తుందో వర్క్‌డన్ పత్రాలు చేసి, వారితో సంతకం తీసుకొని అకౌంట్లలో వేస్తామని పంపించేస్తున్నారు. ఇది పెద్ద సమస్యగా మారింది. గతేడాది ఇంటర్ పరీక్ష, మూల్యాంకనం విధుల రెమ్యునరేషన్ ఆరు నెలల తర్వాత బ్యాంకులో జమ చేసామన్న అధికారులు, ఒకొక్క లెక్చరర్‌కు సంబంధించిన రెమ్యునరేషన్ నుంచి 20 శాతాన్ని టీడీఎస్ కింద కోత విధించారు. ఇదేంటని ప్రశ్నించిన లెక్చరర్లకు ' ఈ 20 శాతం డబ్బులు మళ్లీ మీ అకౌంట్లలో పడతాయని' చెప్పారు. అయితే ఏడాది గడిచిపోయినా కోత విధించిన ఇరవై శాతం రెమ్యునరేషన్ లెక్చరర్లకు అందలేదు.

లెక్చరర్లకు మూడు నెలలైనా అందని పారితోషికం..

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. మూడు నాలుగు ఫేజుల్లో పరీక్షలు ముగించగా, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన పారితోషికం ఇంత వరకు లెక్చరర్లకు అందలేదు. తర్వాత మార్చిలో థియరీ పరీక్షలు జరిగాయి. వీటి మూల్యాంకనం మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగింది. ముల్యాంకనం రుసుం మూడు నెలలు గడిచినా ఇవ్వకుండా సతాయించి, చివరకు జూన్‌లో చెల్లించారు. మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించిన ఇంటర్ బోర్డు, ఇంత వరకు పరీక్షలకు సంబంధించిన పారితోషికం, మూల్యాంకనం పారితోషికం చెల్లించకపోవడంతో లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేసే లెక్చరర్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ రెమ్యునరేషన్ డిమాండ్ చేయడం గమనార్హం. కాగా, ఒక్కో లెక్చరర్, ప్రిన్సిపాల్‌కు కనీసం రూ.15వేల నుంచి రూ.25 వేల దాకా రెమ్యునరేషన్ రావాల్సి ఉందని, ఇంకెప్పుడిస్తారని వ్యాఖ్యానిస్తున్నారు.

ఇంకా అందని 'పది' రెమ్యునరేషన్..

జగిత్యాల జిల్లాలో ఏడాదిన్నర కింద పదో తరగతి జవాబు పత్రాలు దిద్దిన టీచర్లకు రెమ్యునరేషన్ ఇప్పటికీ రాలేదు. ఏమైందో..? ఏమో..? గానీ రాష్ట్రంలోని అన్ని పదో తరగతి మూల్యాంకన కేంద్రాలకు రెమ్యునరేషన్ మంజూరు చేసిన ఎస్సెస్సీ బోర్డు జగిత్యాల మూల్యాంకన కేంద్రంలో పనిచేసిన వారికి మాత్రం మంజూరు చేయలేదు. వందలాది మంది టీచర్లకు, అధికారులకు వేలాది రూపాయల రెమ్యునరేషన్ అందకుండా పోయింది.

మారథాన్‌ను ప్రారంభించి పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, నగరవాసులు

ఉత్సాహంగా మారథాన్ రన్

కరీంనగర్ సైక్లిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన 'కరీంనగర్ హాఫ్ మారథాన్ రన్' ఉత్సాహంగా సాగింది. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో కలెక్టర్ పమేల సత్పతి రన్‌ను ప్రారంభించగా సుమారు నాలుగు వేల మంది పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవితంలో ఆరోగ్యంగా ఉండేందుకు రోజుకో గంట తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. నగరవాసులకు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు 3కే, 5కే, 10కే, 21కే నాలుగు విభాగాలు మారథాన్ రన్ నిర్వహించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుల మహేశ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చహత్ భాజ్‌పాయ్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. -కొత్తపల్లి, సెప్టెంబర్ 22

బీర్‌పూర్ ఘాట్ రోడ్డువద్ద ఓవర్ లోడ్‌తో మొరాయించిన ఆర్టీసీ బస్సు

ఓవర్‌లోడ్.. కదలని బస్సు

బీర్‌పూర్ ఘాట్ రోడ్డు సమీపంలో ఓవర్ లోడ్‌తో వస్తున్న ఆర్‌టీసీ బస్సు ఘాట్‌రోడ్ ఎక్కెందుకు మొరాయించింది. కడెం నుంచి జగిత్యాలకు వస్తున్న ఆర్‌టీసీ బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో బీర్‌పూర్ మండలంలోని ఘాట్ రోడ్డు వద్ద గుట్టెక్కలేకపోయింది. దీంతో ప్రయాణికులు కిందికి దిగి నెట్టడంతో బస్సు ముందుకు కదిలింది. కాగా, ఈ రూట్లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారని, సరిపడా బస్సులను నడిపించాలన్న డిమాండ్ వస్తున్నది. - సారంగాపూర్, సెప్టెంబర్22

రామడుగు మండలం గుండి, లక్ష్మీపూర్ మధ్య వరదలకు శిథిలమైన కల్వర్టు

దెబ్బతిన్న కల్వర్టు.. ప్రయాణికులకు ఇక్కట్లు

రామడుగు మండలం గుండి-లక్ష్మీపూర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వరదలతో వారం రోజులపాటు రాకపోకలు నిలచిపోగా, వరదనీరు తగ్గిన తరువాత కల్వర్టుపై వాహనాలు నడిచేందుకు వీలు లేకుండాపోయింది. ఈ దారిగుండా చొప్పదండికి వ్యాపార పనులపై ప్రజలు వెళ్లివస్తుంటారు. మండలంలోని దత్తోజిపేట, కిష్టంపల్లి, వెంకట్రావుపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల నుంచి వందల సంఖ్యలో గోపాల్‌రావుపేటకు వస్తుంటారు. ప్రస్తుతం కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిస్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - రామడుగు, సెప్టెంబర్ 22

అప్డేట్ చేయరు.. కొత్తవి తేరు

- ఆర్టీసీలో కాలం చెల్లిన టిమ్ మిషన్లు • టికెట్ కొట్టేందుకు కండక్టర్లకు అవస్థలు • ప్రయాణికులకూ తప్పని తిప్పలు

పెద్దపల్లి, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ నిర్వహణ అధ్వానంగా మారింది. సంస్థను ప్రగతిలో నడిపిస్తున్నామని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెబుతుంటే, క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కాలం చెల్లిన బస్సులు, సక్రమంగా పనిచేయని టిమ్ మిషన్లు, రద్దీకి సరిపడా బస్సులు లేక, నడుపలేక సంస్థ అష్టకష్టాలు పడుతున్నది. పెద్దపల్లి జిల్లాలో గోదావరిఖని డిపో 121 బస్సులతో 40రూట్లల్లో, మంథని బస్సు డిపో 33 బస్సులతో దాదాపు 20 రూట్లల్లో ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరుస్తుంటాయి. అయితే కాంగ్రెస్ సర్కారు తెచ్చిన మహాలక్ష్మి స్కీం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తేగా, రద్దీ అమాంతం పెరిగింది. అయితే, అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారిపోయింది.

టిమ్ మొరాయించిందా.. ప్రయాణం గోవిందా..

ఆర్టీసీలో టిమ్స్ వినియోగం 2011 నుంచి అందుబాటులోకి వచ్చింది. గతంలో రద్దీ తక్కువగా ఉండడం వల్ల ఏ ఇబ్బంది లేకుండా టికెట్ ఇష్యూయింగ్ జరిగింది. కానీ ప్రస్తుతం మహాలక్ష్మి ఫ్రీ బస్సు స్కీంతో రద్దీ పెరిగింది. దాదాపుగా 90నుంచి 100 టికెట్లు ఇవ్వాల్సి వస్తున్నది. అంటే ఒక్క ట్రిప్‌లోనే రెండు ట్రిప్పులకు సరిపడా టికెట్లను ఇవ్వాల్సిన పరిస్థితులు రాగా, మిషన్లు మొరాయిస్తున్నాయి. టిమ్స్‌లో బ్యాటరీ డిశ్చార్జ్ కావడం, గేర్స్ మూవ్ కాకపోవడం, మదర్‌బోర్డుకు సంబంధించిన సమస్యలు వస్తుండగా, కండక్టర్లు టికెట్లు ఇవ్వలేకపోతున్నారు. బస్సు కదిలి టికెట్ జారీ చేస్తున్న టైంలో టిమ్ సతాయిస్తే, బండిని పక్కకు ఆపి డిపో నుంచి మరో బస్సు ద్వారా ఇంకో టిమ్ తెప్పించడమో..? లేదంటే తిరిగి బస్సును డిపోకు తీసుకెళ్లి మరొక మిషన్‌ను తీసుకురావాల్సి వస్తున్నది. ఈ క్రమంలో ప్రయాణికుల ప్రయాణం గంటల కొద్దీ ఆలస్యమైపోతున్నది. ఇక మరొకటి అందుబాటులో లేకున్నా, తీసుకువచ్చే పరిస్థితులు లేకపోతే మాత్రం అప్పటి వరకు టికెట్లు కొట్టిన వారిని బస్సులో ఉంచుకొని, మిగతా వారిని బస్సు దించేస్తున్నారు. అంతేకాదు బస్సు మళ్లీ గమ్య స్థానానికి వెళ్లి వచ్చేదాకా మరో ప్రయాణికుడిని ఎక్కించుకునే అవకాశమే లేదు. బస్టాండ్లకు బస్సు వెళ్లినా ఉన్న ప్రయాణికులను దింపడమే కానీ కొత్తవారిని ఎక్కించుకునే పరిస్థితి లేదు. ఇలాంటి సమస్యలతో అటు కండక్టర్లు, ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని, టిమ్స్ రీప్లేస్‌మెంట్ లేదా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. అయితే, ఇటీవల పెరిగిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్తగా ఐటిమ్స్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు కొట్టి టికెట్ తీసుకునే సౌకర్యం ఉంది. హైదరాబాద్ సిటీలో వినియోగిస్తున్న మిషన్లను జిల్లాలోని బస్సు డిపోల్లో వినియోగంలోకి తేవాలని కండక్టర్లు, ప్రయాణికులు కోరుతున్నారు.

నాటుబాంబు తయారీదారుతో పాటు నిందితుల అరెస్ట్ చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

నాటు బాంబులు పెట్టి.. వన్యప్రాణుల వేట

- తయారీదారుతో పాటు మరో ముగ్గురు అరెస్ట్

కోనరావుపేట, సెప్టెంబర్ 22 : నాటు బాంబులను తయారు చేస్తున్న వ్యక్తితోపాటు జంతువులు, వన్యప్రాణులను వేటాడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 24 గంటలు గడువక ముందే పోలీసులు కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ముడికె మల్లేశం అనే రైతుకు చెందిన బర్రె నాటు బాంబు కొరుకగా అది పేలడంతో ప్రాణాలు కోల్పోయింది. దీంతో సదరు వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అదే గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా నాటు బాంబులను తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. ఇటీవల సిరిసిల్ల రూరల్ మండలం చిన్న బోనాలకు చెందిన పడిగె లస్మయ్య, తుమ్మల కనుకరాజు, సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్య అతని వద్ద నాటు బాంబులు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వీరంతా వారివారి అటవీ ప్రాంతాల్లో నాటుబాంబులను గొర్రె పేగులకు చుట్టి జంతువులకు ఎరవేసి ఉంచుతున్నారు. దీంతో అటవీ జంతువులు వాటిని కొరికితే పేలడంతో అక్కడికక్కడే మృతి చెందగా, వాటి ద్వారా వచ్చే మాంసాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. ఇటీవల సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్య పల్లిపిండిలో నాటుబాంబును ఉంచి ధర్మారం శివారులో ఎరవేసి ఉంచాడు. ఈ క్రమంలో అటుగా వెళ్లిన ముడికె మల్లేశం బర్రె బాంబును కొరికి మృతిచెందింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో భాగంగా రాజలింగం వద్ద 7 నాటు బాంబులు, తయారు చేసే గన్ పౌడర్, రూ.2 వేలు, పడిగె లస్మయ్య వద్ద 10 నాటు బాంబులు, తుమ్మల కనుకరాజు వద్ద 10 నాటుబాంబులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై బీఎన్ఎస్, ఎక్స్‌ప్లోజివ్స్, వన్యప్రాణుల చట్టం ప్రకారం కేసు నమోదు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే, సిరిసిల్ల పోలీసులు సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్యను పట్టుకుని 40 నాటు బాంబులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన రుద్రంగి ఎస్ఐ అశోక్, కోనరావుపేట ఇన్‌చార్జి ఎస్ఐ కిరణ్‌కుమార్, ఏఎస్ఐ రఘుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు విశాల్‌రాజ్, రవి, సతీశ్, అభిషేక్‌ను సీఐ అభినందించారు.

వెంపేట రోడ్‌లోని రైల్వే బ్రిడ్జి వద్ద వినూత్నంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

'మేం రోడ్డు మీది బొందలం'

వ్యంగ్యాస్త్రాలతో రోడ్డు పక్కన ఫ్లెక్సీ ఏర్పాటు

''అందరికీ నమస్కారం.. మేం రోడ్డు మీద ఏర్పడిన బొందలం. దయచేసి మమ్ములను పూడ్చండి'' అంటూ వ్యంగ్యాస్త్రాలతో మెట్‌పల్లి పట్టణంలోని వేంపేట్ రోడ్డు రైల్వే బ్రిడ్జి కింద ఓ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. నిత్యం వేలాది మంది ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం ఇలా వినూత్నంగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అధికారులను నిద్రలేపేందుకే అంటూ సోషల్ మీడియాలో ఈ ఫ్లెక్సీ చక్కర్లు కొడుతోంది. - మారుతీనగర్, సెప్టెంబర్ 22

పుస్తకాన్ని శ్యాంప్రసాద్‌లాల్‌కు అంకితమిస్తున్న కవులు

స్వచ్ఛమైన స్నేహానికి నిదర్శనం కరీంనగర్ బ్రదర్స్

పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 22 : స్వచ్ఛమైన స్నేహానికి మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య నిదర్శనమని పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఇద్దరూ గాఢమైన స్నేహాన్ని కొనసాగిస్తూ ఒకే అభిరుచితో సాగడం అందరికీ ఆదర్శమన్నారు. ఇప్పుడు ఇద్దరూ కలిసి 'మేము' పేరుతో కవితా సంకలనం వెలువరించడం అభినందనీయమన్నారు. ఆదివారం కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో ఈ సంకలనాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రావికంటి శ్రీనివాస్, నలిమెల భాస్కర్, గండ్ర లక్ష్మణ్‌రావు, అన్నవరం దేవేందర్, నంది శ్రీనివాస్, కలువకుంట రామకృష్ణ పాల్గొన్నారు.

రమేశ్‌కు నగదును అందజేస్తున్న డీఎం శ్రావణ్‌కుమార్

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

- బస్సులో మరిచిపోయిన రూ.2లక్షల నగదు ప్రయాణికుడికి అందజేత

మంథని, సెప్టెంబర్ 22: బస్సులో ఓ ప్రయాణికుడు మరిచిపోయిన రూ.2లక్షల నగదు ఉన్న బ్యాగును తిరిగి అప్పగించిన ఘటన పెద్దపల్లి జిల్లా మంథని డిపోలో జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన జే రమేశ్ ఆదివారం గోదావరిఖని నుంచి భూపాలపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కాటారంలో ఎక్కాడు. అతను తన వెంట రూ.2 లక్షల నగదుతో ఉన్న బ్యాగును సీటులోనే మరిచి భూపాలపల్లిలో బస్సు దిగాడు. కొద్ది సేపటి తర్వాత బ్యాగు మరిచిన విషయాన్ని గుర్తించి కంగుతిన్నాడు. వెంటనే భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి సెక్యూరిటీ సిబ్బందికి విషయాన్ని వివరించారు. వెంటనే వారు మంథని డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ సమాచారం ఇవ్వగా, ఆయన అప్రమత్తమయ్యారు. కండక్టర్ తిరుపతమ్మతో మాట్లాడి బ్యాగును భద్రపరిచారు. అనంతరం రమేశ్‌ను మంథని ఆర్టీసీ డిపోకు పిలిపించి, రూ.2లక్షల నగదును అందించారు. ఈ సందర్భంగా నగదు విషయంలో వెంటనే అప్రమత్తమైన భూపాలపల్లి సెక్యూరిటీ సిబ్బందిని, బ్యాగును భద్రపరిచిన కండక్టర్‌ను డీఎం ప్రత్యేకంగా అభినందించారు.